## తల్లి-కొడుకులు

సరోజని ఇండియాకు వచ్చేసింది. విమానం దిగి తన సామాను తీసుకుని బైటికి వస్తుండగా నరసింహం కనుపించాడు.

"అమ్మగారూ నేనొచ్చానండి, మీ ఉత్తరం మొన్న చేరింది. ఈ సామాను తీసుకుని టాక్సీలో పెట్టనాండి" ఆమె చేతిలో ఉన్న సూట్ కేసందుకున్నాడు.

"అదొక్కటే టాక్సీ మాట్లాడు" అన్నది.

టాక్సీ రాగానే కూర్చుని ''నరసింహం! నన్ను గుర్తుపట్టేవా? నేను ఇక్కడి నుంచివెళ్ళి ఆరేళ్ళయినట్టుగాఉంది. నీ భార్యా పిల్లలూ బాగున్నారా? నేను వెళ్ళే టప్పటికి చిన్నపిల్లలు. చదువుతున్నారా?"

"చదువుతున్నారండి అబ్బాయి నాలుగోక్లాసు - అమ్మాయి రెండోక్లాసులో ఉన్నారు. నా భార్యకూడా చిన్న ఉద్యోగంచేస్తున్నదండి" నవ్వుతూచెప్పాడు.

"అలాగా? ఏం ఉద్యోగం? బాగాచదువుకోలేదన్నావుగా?'

"పెద్ద చదువులేదండి పిల్లల స్కూల్లోనే చిన్న ఉద్యోగం. టీచర్లు రాక ముందు బ్లాక్ బోర్డు తుడిచి చాక్ పీసు దానికిదగ్గరగా పెట్టటమూ, పిల్లలు వచ్చిన తరువాత అల్లరిచేయకుండా కూర్చోబెట్టి అటెండెన్సు తీసుకోవటమూనండి. క్లాసులో టీచర్ లేనప్పుడు పిల్లలకు ఏదో కథలూ కబుర్లూచెప్పి వాళ్ళు ఇటూఅటూ తిర కుండా చూసుకోవటమేనండి. మూడువందల జీతంఇస్తారు."

"బాగుంది అయితే పిల్లలతోటే వెళ్ళిపోతుందన్నమాట. మళ్ళీ వాళ్ళతోనే వస్తుందా?''

"అవునండి."

ఇల్లురాగానే కారాగింది సామానుదించి గేటుతీసి మెట్లమీద పెట్టాడు. ఆమె

టాక్సీనిపంపించి లోపల అడుగుపెట్టి ఇటూ అటూ చూసింది. వాకిలిఊడ్చి నీళ్లు చల్లి, ముగ్గులేసిఉంది. ఇంటిముందర ఉన్న స్థలంలో పూలచెట్లు బారులుతీర్చి తల లూపు తున్నాయి పూలతో.

తలుపుతీసి లోపలికి నడిచింది హాల్లో ఎదురుగా చంద్రమౌళి ఫొటో కన బడ్డది.

"అమ్మయ్య తన ఇంటికి తను వచ్చేసింది!" ఒక మాదిరి సంతోషమూ సంతృప్తీ కలిగాయి. అక్కడే ఒక కుర్చీలో కూర్చుంది.

"అమ్మగారు పాలు తీసుకున్నాను, కాఫీ కలిపి తీసుకువస్తాను బ్రూ కలప మంటారా?" అడిగాడు.

"ఏదో ఒకటి తీసుకురా"

ఐదు నిమిషాలలో బ్రూ కలిపి తీసుకువచ్చాడు

"నీళ్లు కాగపెడతాను స్నానం చెయ్యండి మా మీరాబాయి పదకొండు గంటలకువచ్చి వంటచేస్తుంది. కూరగాయలేమయినా తెమ్మంటారా?"

"ఏదో ఒకటి తీసుకురా సాంబారుచేసి కూరచేస్తేచాలు."

"పెరుగు రాత్రి తోడుపెట్టిందండి, నీళ్ళు కాగాయి మీరు స్నానం చెయ్యండి."

విమానంలో ప్రయాణంచేసినా బడలికే ఆమె వేడి వేడి నీళ్ళు స్నానంచేసి హాల్లో పడకకుర్చీలో కూర్చుంది. ఏమిటో ప్రాణం అలసిపోయినట్టుగాఉండి కళ్ళు మూతలుపడ్డాయి.

మీరాబాయివచ్చి వంటచేసింది "అమ్మగారూ భోజనంచేసి పడుకోండి. మీకోసం పేపరుకూడా కొనుక్కొచ్చాడు", బల్లమీద భోజనానికి అన్నీ తయారు పెట్టి నిలబడ్డది మీరాబాయి.

సరోజనిలేచి "నేను భోజనంచేస్తాలే. అన్నీ బల్లమీద పెట్టావుగా నీ పని చూసుకో" అని లేచి బల్లముందరకూర్చుని ''ఎన్నాళ్ళయింది ఇలా నిశ్చింతగా కూర్చుని భోజనంచేసి?'' అనుకుంటూ భోజనముగించి మళ్ళీ హాల్లోకివచ్చి అదే కుర్చీలోకూర్చుని పేపరు చదివింది.

''మళ్ళీ నిద్ర వస్తున్నట్టుగాఉంది'' అని గదిలోకివెళ్ళి పడుకుంది.

ఆమె నిద్రలేచి బయటికిరాగానే నాలుగుగంటలు దాటింది.

మీరాబాయి టీ బిస్కెట్లుతెచ్చి బల్లమీద పెట్టింది.

"నీవుకూడా ఇంట్లోనేఉన్నావా? నరసింహం నీవు ఉద్యోగం చేస్తున్నావని చెప్పాడు?''

"నేను సగం రోజు సెలవుపెట్టానండి ఆయన నాలుగురోజులు పెట్టారు."

"అయ్యో నాకోసం సెలవులెందుకు పాడుచేసుకుంటారు? రేపటినుంచీ మీ డ్యూటీ మీరు చేసుకోండి.''

టీ తాగి మళ్ళీ ఆ కుర్చీలో కూర్చుంది-నిశ్చింతగా.

అంతలో నరసింహం మీరాబాయి, ఇల్లు నాలుగు మూలలా బూజులు దులిపారు ఇల్లుఊడ్చి తుడిచారు. ఎక్కడి సామాను అక్కడ పెట్టారు. ఏడు గంటలు కాగానే మీరాబాయి వంటచేసి బల్లమీద పెట్టి వెళ్ళిపోయింది.

నరసింహం కనబడగానే "నాలుగురోజులు సెలవుపెట్టావట ఎందుకు? రేపు నాకు కావలసినసామాను తెచ్చిపెట్టుచాలు. ఎల్లుండినుంచీ నీ పనిలోకివెళ్ళు. సెలవులు ఉన్నాయికదాఅని ఖర్చుచెయ్యకు" అంది.

"మీకు ఏదయినా పని ఉంటుందని సెలవు పెట్టానండి. బ్యాంకులోపని ఉంటే చెప్పండి. రేపు వెళ్తాను'' అన్నాడు.

"అవును ఆపనికూడాఉంది. అన్నీ రేపటితో ముగించెయ్యి. పొరపాటున అన్నానుగాని బ్యాంకిపని నేనే చూసుకుంటాను. నీవు రేపు మధ్యాహ్నం సరుకులు తెచ్చిపెట్టుచాలు" అంది.

మధ్యాహ్నం టీ తాగిన తరువాత మత్తుదిగి పోయినట్టుగాఉంది. లేచి ఇల్లంతా తిరిగింది.

ఇల్లయినా ఏమంత పెద్దదికాదు. చంద్రమౌళి రిటైర్కాకముందే పిల్లలిద్దరి చదువులూ పెళ్ళిళ్లూ అయ్యాయి. విదేశాలకు చదువులకనివెళ్ళి అక్కడే స్థిరపడి పోయారు. అందుచేత ఇల్లు పెద్దదిగాకట్టలేదు. కాని-మరీ అంత చిన్నదీకాదు.

ఆయన ఇంజనీయరుగా రిటైరయినాడు. అప్పటినుంచీ ఇంట్లోఇద్దరే సాయంత్రపు వేళల్లో ఇద్దరూ అలా గాలికి ఒక మైలుదూరంవరకూ వాకింగుకి వెళ్ళేవారు. ఇంటికివచ్చి టీ. వీ. చూస్తూ భోజనాలు చేసేవారు. వాకిటివరెండాలో కుర్చీలు వేసుకుని కూర్చుని ఏవో కబుర్లు - పిల్లలనుగురించీ వాళ్ళ కుటుంబాలను గురించీ మాట్లాడుకునేవారు. ఆయన తన చిన్ననాటికబుర్లూ - చదువుకునేటప్పుడు తన స్నేహితులూ ఇంటికి వెళ్ళినప్పుడు తన తల్లిదండ్రులవీ ఏవేవో కబుర్లు చెప్పే వాడు. ఆయన కబుర్లుచెప్పటం మొదలుపెడితే ఎన్నిగంటలయినా అలా గడిచి పోయేవి. సరిగ్గా పది గంటలయిన తరువాత ఒక్క నిమిషమైనా కూర్చునేవాడు కాదు వెంటనే పడకను చేరవలసిందే.

తెల్లవారకముందేలేచి, ముఖం కడుక్కోవటం స్నానం వగైరా ముగించి పేపరు పట్టుకుని భోజనాలింట్లో బల్లదగ్గర కూర్చోవటం అలవాటు. అక్కడికే కాఫీ బ్రెడ్ వెన్నచాకువచ్చేవి. చాకుతో బ్రెడ్కి వెన్నరాసుకుని తింటూ కాఫీ తాగే వాడు. ఆ తరువాత పేపరంతా పైనుంచి కిందివరకూ చదివి అక్కడ పడేసి లేచేవాడు.

చంద్రమౌళికి స్నేహబృందమెక్కువ. ఎనిమిది గంటలనుంచీ ఎవరో ఒకరు వస్తూఉండేవారు. అది వేసవి అయితే నిమ్మరసం, చలికాలమయితే కాఫీ వాళ్ళకిస్తూ హాస్యప్రసంగాలు చేస్తూ నవ్వులు కురిపిస్తూ ఉండేవాడు. ఎంత మందిలో ఉన్నా - ఆ ప్రసంగం ఎంత పట్టులోఉన్నా - పన్నెండయేసరికి దిగ్గున లేచేవాడు.

స్నేహితులకూ ఆ సంగతి తెలుసు. "మళ్ళీ కలుద్దాం" అంటూ లేచేవారు. ఆయన అక్కడినుంచి తిన్నగా వంటయింట్లో తొంగిచూసి భోజనాల యింట్లోకి వచ్చేసరికి ఆమె పేపరక్కడ పడేసేది. భోజనాలు చేసేవారిద్దరూ. వక్క, లవంగం, ఏలక్కాయ వంటివేమీ ఆయనకు అలవాటు లేదంటే ఎవరూ నమ్మరు.

రోజులు అన్నీ ఒకమాదిరిగా గడవవని అందరికీ తెలిసిన విషయమే. కాని స్వంత విషయంలో ఆ మాట అనుకోవటం అరుదు. ఆయనకూ తెలుసు. ఎప్పుడో ఏవేళప్పుడో తన ఊపిరి ఆగిపోతుందని. ఆయనకు ఊపిరితిత్తులలోకి నీరు వచ్చింది. కొంచెం గట్టిగా మాట్లాడినా గబగబా నడిచినా ఊపిరి అందేదికాదు.

అప్పుడప్పుడు అనేవాడు- "సరూ, నాకు ఊపిరి ఆడుతున్నదా లేదా" అని.

"హాస్యమా ఏమిటి? ఊపిరాడకపోతే ఎట్లా మాట్లాడగలుగుతున్నారు?" పగలబడి నవ్వేది.

"అలా హాస్యాలాడుతూనే ఒకరోజు రాత్రి పడుకున్న అతడు తెల్లవారి లేవలేదు. బద్ధకించి పడుకున్నాడేమో అనుకుంది. ఏడుగంటలవరకూ చూసి డాక్టరుగారికి ఫోనుచేసింది.

"నిజంగానా హాస్యంగానా?" అన్నాడాయన నవ్వుతూనే.

"హాస్యంకాదండీ నిజమే. ఆయన లేవలేదు. పిలిస్తే పలకటంలేదు" అన్నది గద్గద స్వరంతో.

"నిజంగా! అయితే వచ్చేస్తున్నా" అంటూ ఐదునిమిషాలలోపల వచ్చాడు. కళ్ళలో టార్చివేసి చూశాడు. నాడిచూశాడు. గుండె పరీక్ష చేశాడు.

"అమ్మా- ఏమీలేదక్కడ. పిల్లల ఫోనునెంబర్లు ఇస్తే చేస్తా" నని చేశాడు.

పిల్లలు వచ్చేసరికి నాలుగోరోజయింది. డాక్టరు మంచుగడ్డలు అటూ ఇటూ పెట్టించాడు. ఆ నీరువలన దేహం ఉబ్బిపోయింది పిల్లలు వచ్చేటప్పటికి-

పది పన్నెండు రోజులున్నారు ఇద్దరు కొడుకులూ. తమతోకూడా ఆమెను రమ్మనమని బలవంతం చేశారు.

"ఇప్పుడు రాను. తరువాత చూస్తా" నన్నది.

ఆమె, ఆయన రిటైరయినప్పుడు ఒక చిన్న ప్లాటు పెరట్లో కట్టిచ్చింది.

"ఇదెందుకు?" అన్నాడు చంద్రమౌళి.

"మనం పిలిచినప్పుడు పలికేవాళ్లుండాలి" అంది.

"టెలిఫోనుందిగా?"

"టెలిఫోనుంటే చాలదు-మనిషి కావాలి. పిలిస్తే వచ్చి సహాయం చేయాలి. ఒక మనిషి ఉంటాడు. అవసరమైన సహాయం చేస్తాడు." అని సర్దిచెప్పి, ఒక్క గదే అయినా దానికి, వంటఇల్లు, బాత్‌రూమ్, వాకిటి వరండా కట్టించింది.

"మా ఆఫీసులో ఒక అటెండరు ఉన్నాడు. పెళ్ళికాలేదు. వాడిని రమ్మని ఫోనుచెయ్యనా ?" అన్నాడు.

"ఇది హాస్యం కాదుకదా. పిలవండి నేను చూస్తాను" అంది.

అలా ఆ యింట్లో అడ్డెలేకుండా ప్రవేశించాడు నరసింహం. అటుతరువాత పెళ్ళిచేసుకున్నాడు, పిల్లలు. వాళ్ళకు స్వెటర్లు అల్లిపెడుతూ ఉండేది. ఆ కుటుంబానికి ఏదికావాలన్నా సమకూర్చేది. వాళ్లుకూడా చనువుగా ఏదికావాలన్నా తెచ్చి యిస్తూ సహాయంగా ఉండేవారు.

చంద్రమౌళి పోయిన తరువాత చాలారోజులు అతని భార్య వంటచేసి బల్లమీద పెట్టేది. నరసింహం బజారుపనులు చేసేవాడు.

ఆమెకు మూడవకొడుకుగా మెలుగుతూ అమ్మా అని పిలిచేవాడు. అమెకు ఏ లోపమూ జరగకుండా చూసేవాడు. ఆమె మీరాబాయికి రెండు పురుళ్లు పోసింది. పసిపిల్లలకు కావలసినవన్నీ కొనిపెట్టేది. ఆమెకూడా అమ్మా అని పిలుస్తూ రెండుపూటలా కాఫీ వంటచేసి బల్లమీద పెట్టేది-వద్దంటున్నా.

ఒక ఏడాది తరువాత పెద్దకొడుకు ఫోన్‌చేశాడు తను వస్తున్నానని. రెండు రోజులున్న తరువాత "అమ్మా నిన్ను నాతో తీసుకువెళతాను. నీకు వీసా టికెట్ తెస్తాను రెడిగా ఉండు" అన్నాడు.

"నేనెందుకురా ఇప్పుడు అక్కడికి ?" అయిష్టంగా మాట్లాడింది.

"ఎన్నాళ్ళుంటావిక్కడ ఒంటరిగా. మా స్నేహితులు చాలామంది తల్లులను తీసుకొచ్చారు నీవుకూడా రా. టికెట్ పంపితే చాలదా అని సుమన అన్నది. కాదులే, నేనువెళ్ళి తీసుకురావాలి" అని వచ్చాను అన్నాడు.

కన్నకొడుకుచేత బ్రతిమిలాడించుకోవటము ఎందుకని బయలుదేరింది. నరసింహానికీ, మీరాబాయికీ ఇల్లు జాగ్రత్త అని చెప్పి బయలుదేరింది.

ఇంటికి వెళ్ళగానే ఎదురుగా వచ్చిన కోడలిని చూసి తెల్లబోయింది. నెలలు నిండినట్లున్నాయి. ఇప్పుడో అప్పుడో హాస్పిటల్‌కి వెళ్ళేటట్లుగా ఉంది.

"వేళకు వచ్చానుకదా" అనుకుంది.

ఆమె లెక్క సరిగానేఉంది. ఆమె వెళ్ళిన నాలుగోరోజున హాస్పిటల్లో పురుడు వచ్చింది, ఆడపిల్ల. ఆదేశంలో పురుడువచ్చిన బాలెంతను హాస్పిటళ్లో ఎక్కువరోజులు ఉంచుకోరు. మూడురోజులు ఉంచుకుంటే మహా గొప్ప.

అంతకుముందు ఏంచేసేవారోగాని సరోజిని వచ్చినప్పటినుంచీ బట్టలుతకటం- గిన్నెలు తోమటం ఇల్లు శుభ్రంచేయటం వంటి పనులన్నీ ఆమెమీద పడ్డాయి. పసిపిల్ల, బాలెంతవాళ్ళ బట్టలు ఒకబకెట్ నిండేవి, తనవీ కొడుకువీ కలిపి ఈ బట్టలన్నీ మధ్యాహ్నం భోజనం కాగానే ఉతికి తాటిమీద ఆరవేసి క్లిప్పులు పెట్టేది. బట్టలు ఉతకంగానే కోడలికి కాఫీవేళ - పాపకు పాలవేళ అయేది. అవికూడా తయారుచేసి ఇచ్చి కొంచెంసేపు పడుకుందామంటే పాప ఏడ్చేది. ఆ పాపను ఎత్తుకొని తిప్పితిప్పి నిద్రబుచ్చేసరికి కొడుకు వచ్చేవాడు, మళ్ళీ కాఫీలు టిఫిన్‌లూ—ఆపకుండా ఇంటిపని.

పనిచేయటం అలవాటుతప్పిన సరోజినికి కష్టంగానే ఉండేది ఊపిరాడని ఈ పనులతో. కాని అది కొడుకుఇల్లు, కోడలు బాలెంత - తను విధిగా చెయ్యవలసిందే, అనుకుని లేనిబలం తెచ్చుకునేది. రెండు నెలలయేసరికి చిక్కిసగమయింది.

కోడలు సుమన లేచి తిరగటం మొదలుపెట్టిన తరువాత ఆఫీసుకు పోవటం మొదలుపెట్టింది. ఆమె ఒక డాక్టరుదగ్గర సెక్రెటరీ. ఎనిమిదిగంటలకు అక్కడ సిద్ధంగా ఉండాలి డాక్టరు వచ్చేటప్పటికి. కొడుకు కూడా ఆమెను దింపి తను ఆఫీసుకు వెళ్లాలి.

ఎనిమిదిగంటలకు ముందే బయలుదేరాలంటే వంటకాలు ఇంకా ముందుగా తయారుకావాలి. కేంటిన్‌లో కావాలంటే తినవచ్చు గాని డబ్బు చాలా ఖర్చు అవుతుంది.

ఇవన్నీ ఆలోచించి ఇంకా తొందరగా లేచి పనిచేయటం మొదలుపెట్టింది. అందరికీ సౌకర్యంగానే ఉందిగాని. ఆమె ఆరోగ్యం దెబ్బతిన్నది. లేచి ఇదివరకు చేసినట్టు పని చేయలేకపోయేది. పిల్లను చూసుకోలేకపోయేది. కాళ్ళు నడవనివ్వవు చేతులు పనిచేయనివ్వవు. అందరికీ కావలసినవి వేళకు అందకపోతే అందరికీ కోపాలే. పాపకు పాలు ఆలస్యమయితే పాప ఏడుస్తుంది. పాప ఏడిస్తే తల్లికీ తండ్రికీ కోపం వస్తుంది

''ఏంచేస్తున్నావమ్మా ? పాప ఏడుస్తోంది వినబడటంలేదా ?" అరుపులు కొడుకువి వినబడుతూ వుండేవి.

ఇక్కడ పాపకు మూడవనెల అయితే అక్కడ చిన్నకొడుకు భార్యకు నెలలు నిండాయని వచ్చాడు.

"అమ్మా. నీ కోడలు ఇవాళో రేపో హాస్పిటల్లో చేరబోతున్నది. నీవు వెంటనే బయలుదేరు."

"నాయనా అన్నయ్యను అడుగు పంపితే వస్తాను" అన్నది. 'కాని చెయ్యి లేక జబ్బుపడితే తనకెవరు చేస్తారు?' ఈ మాట స్ఫురించగానే భయం వేసింది. వాళ్ళు అడిగి అడిగి చేయించుకోగలరు. కాని- తను అడగలేదు- అరవనూలేదు. తనది తల్లిపాత్ర.

ఆమె తనదగ్గర సరిగా పనిచేయలేకపోతున్నదని పెద్దకొడుకు "తీసుకు వెళ్లు"అన్నాడు. ఇంకా రెండురోజులుంటే ఆమెకు మందులిప్పించేభారం తనపైన పడుతుంది. అసలే డబ్బుఖర్చులో ఉన్నాడు.

అమ్మ వస్తుందన్న సంతోషంతో చిన్నకొడుకు తీసుకువెళ్ళాడు. తల్లి ఒకటి రెండురోజులు అతి కష్టమ్మీద పనిచేసింది. ఆపైన ఆమె లేవలేకపోయింది. ఆరోజే చిన్నకోడలు హాస్పిటల్లో చేరి మగపిల్లవాడిని కన్నది. ఆ సంతోషవార్త విని పడుతూ లేస్తూ పదిరోజులు పనిచేయగలిగింది. "అక్కడ బాగా చేశావు ఇక్కడ మూలుగుతున్నావు" అన్నాడు కొడుకు. ఆమె మనసు చివుక్కుమన్నది.

నిజానికి ఆమెకు ఇద్దరూ ఒకటే. కాని అక్కడ చేసినప్పుడు దేహంలో శక్తిఉంది. ఇక్కడికి వచ్చేసరికి పనిమీద పని చేయలేకపోయింది. రోజూ కొడుకు అరుపులే 'బాలెంతకు అబ్బాయికి వేళకు ఏమీ అందటంలేదని' ఆ మాట అంటాడనే తన సర్వశక్తులూ ఉపయోగించేది పనిచేయటానికి. ఒకనాడు కప్పుతో కాఫీ కోడలికి తెస్తూఉండగా ఆమెకు కళ్లుతిరిగి కిందపడిపోయింది. కాఫీ కిందపడ్డది. కప్పు పగిలింది. ఆమె అంత దూరాన పడ్డది.

ఆ చప్పుడికి ఆమె కొడుకు వచ్చాడు, "ఇంతసేపా కాఫీ తీసుకురావటానికి? అబ్బాయికి పాలుతాగించే వేళయింది. వాడూ ఏడుపు మొదలు పెట్టాడు" అని కప్పు పెంకులు ఏరుతూ "అంతా పారబోశావు. పైగా కప్పు పగిలింది. నీకంత

ఇష్టంలేకపోతే రానని చెప్పవచ్చుగా?" అనుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళి భార్యకు కాఫీ కలిపి ఇచ్చాడు. పిల్లవాడికి బుడ్డీలో పాలుపోసి తీసుకువెళ్ళాడు.

తన పనంతా అయినతరువాత అప్పుడు తల్లికోసం చూశారు. ఆమె ఒక మూలకు పడిఉంది. లేపితే లేవలేదు.

అప్పుడు అనుకున్నాడతడు- "ఈమెకు మందు అవసరమేమో?" నని.

డాక్టరుదగ్గరికి తీసుకువెళితే చాలా ఖర్చవుతుంది. వెళ్లటానికి రావటానికీ ఖర్చు? డాక్టరు పరీక్షచేసినందుకు ఖర్చు! మందులకు ఖర్చు.

ఆలోచించి అన్నగారికి టెలిఫోన్ చేశాడు. అతడు వచ్చినతరువాత ఇద్దరూ ఆలోచించుకుంటున్నారు. "మనం హవుస్‌కీపర్లను తీసేసి అమ్మకయే ఖర్చును భరీచేయాలనుకున్నాం. కాని, ఇప్పుడు ఈమెకయే మందుఖర్చులే చాలా అవుతాయి ఏంచేద్దాం?"

తల్లికి అప్పుడప్పుడే స్పృహ వస్తోంది. కొన్ని మాటలు చెవిన పడ్డాయి. తను కన్నకొడుకులే తన విషయంలో ఇట్లా భావిస్తుంటే చాలా బాధకలిగి కన్నీళ్లు వాళ్ళు చూడకుండా తుడుచుకున్నది.

"అబ్బాయిలూ, నాకు కళ్ళుతిరిగి పడిపోయాను. ఆ పడటంలో ఒక కప్పు పగిలింది. కాఫీ కింద ఒలికిపోయింది. నాకు శక్తిలేదు. ఏంచెయ్యను? ఇక్కడ మందులఖర్చు డాక్టర్లఖర్చు ఎక్కువ మీరు నన్ను ఇంటికిపంపిస్తే వెళ్ళిపోతాను. మీ ఖర్చులే కాక నాక్కూడా ఎక్కడ పెడతారు? టికెట్ తెప్పించండి" అన్నది హీనస్వరంతో.

"అన్నయ్యా, నీ దగ్గరికి తీసుకెళ్ళి టికెట్ తీసుకుని పంపించు" అన్నాడు చిన్నకొడుకు.

"మొన్నటి పురిటిఖర్చులూ మందులూ ఎంతయిందనుకున్నావు? నేను ఇప్పుడు ఒక్క పెన్నీ కూడా లేకుండా బాధపడుతున్నాను" అన్నాడు.

"మరి టికెట్ ఎట్లా? టికెట్ కొనకపోతే మందులిప్పించాలి. అదయినా ఖర్చే."

"సరే మనం ఏ ఒక్కరం పూర్తిఖర్చును భరించలేము. ఇద్దరం చెరిసగం వేసుకుందాం టికెట్ కొను" అన్నాడు చిన్నకొడుకు.

"అమ్మా! బొంబాయినుంచి మన ఊరికి రైలుమీద వెళతావా? కొంచెం ఖర్చు తగ్గుతుంది" అన్నాడు పెద్దకొడుకు.

"నాయనా! తొందరగా వెళ్ళి మందు తీసుకోవాలి. దారిలోనే ఆలస్యమయితే ఇబ్బందిపడతాను. ఏదోవిధంగా మీరు పంపిస్తే నేను ఈ టికెట్‌కయిన ఖర్చు ఇంటికివెళ్ళి మీ డబ్బు మీకు, ఎవరయినా వస్తుంటే పంపిస్తాను. ఎలాగో టికెట్ కొనండి" అన్నది ఓపికతెచ్చుకొని.

ఆమె ఒకరోజు బజారుకువెళ్ళి బ్రెడ్ కొనుక్కురావలసి వచ్చింది. అప్పుడు ఇంటికి ఉత్తరం రాయాలని ఒక ఎయిరోగ్రామ్ కొన్నది. వెంటనే వంటయింట్లో కూర్చుని ఉత్తరం రాసి వాళ్ళచేతనే పోస్టు చేయించింది. మూడవనాడు బయలు దేరాలనుకుంటే ఆమెకు జ్వరం వచ్చింది. కాస్త తగ్గినతరువాత ఇంటికి ప్రయాణ మైంది.

ఇద్దరూ విమానం ఎక్కించటానికి వచ్చారు.

"అమ్మా, ఇంటికి వెళ్ళగానే ఉత్తరం రాయి. ఎవరయినా వస్తుంటే డబ్బు పంపించు. నీకింకా ఊరు చూపించనేలేదు. ఇంతలోకి ఈ ప్రయాణం ఒకటి వచ్చిపడ్డది అన్నారు ఇద్దరూ చెరొకవిధంగా. ఆమె విమానం బయలుదేరిన తరువాత కుర్చీనానుకొని నిద్రపోయింది. మధ్యలో ఎయిర్‌హోస్టెస్ వేడివేడి టీ ఇచ్చింది. మళ్ళి నిద్రపోయింది. బొంబాయి వచ్చినతరువాత అక్కడ తనదగ్గ రున్న రూపాయలు చెల్లుతాయి కనుక బ్రెడ్, టీ తాగింది.

ఆ విమానాశ్రయం నుంచి ఇంకొక విమానాశ్రయానికి వెళ్ళాలి. టైమ్ చూసుకుని టాక్సీలో వెళ్ళింది అక్కడ విమానం ఎక్కిన తరువాత రెండు పూరీలు ఒక కప్పు టీ ఇచ్చారు ఎయిర్‌హోస్టెస్‌లు. ఏదోవిధంగా ఆ టీ తాగి బేగంపేట విమానాశ్రయం చేరుకుంది. సుమారు రెండుగంటల లోపున.

తన పెట్టెను కాళ్ళీడ్చుకుంటూ తెచ్చుకుంటుండగా నరసింహంవచ్చి ఆమె చేతిలోని పెట్టెనందుకున్నాడు.

ఇంటికివచ్చి రెండు క్రోసిన్ మాత్రలు ఉదయం రాత్రి వేసుకుంది. భోజనం చేసి బాగా నిద్రపోయింది.

నరసింహం అడిగాడు "అమ్మా, ఆ ఊరంతా చూపించారా అబ్బాయిలు? అందరూ బాగున్నారా అమ్మా."

"ఊరంతా చూపించారు 'ఇంకా ఎన్నో చూడాలి బయలుదేరు' అనేవారు. నాకు ఓపికలేక చూసింది చాలు అనేదాన్ని పెద్దవాడు చిన్నవాడూ ఒకటేగొడవ. ఇంకా రెండు నెలలుండమని. నాకిక్కడ అలవాటు కనుక ఎప్పుడు ఇంటికి వెళ్దామా అని అనిపించి వాళ్ళను తొందరపెట్టాను వెళ్ళిపోతానని" అన్నది. కాని-ఆమె మనసులో 'నా కొడుకులు నన్ను ఎట్లాచూసినా నేను వాళ్ళకు మాటరాని స్తానా' అన్నమాటను పైకిరానివ్వలేదు. ఆరేళ్లుకాదు-ఆరు నెలలయినా ఉండలేదు. వాళ్లు ఉంచుకోలేకపోయారని ఆమె అనుకోదు. మళ్ళీ ఎప్పుడయినా వెళ్లాలి అనుకుంటుంది. ఎవరైనావస్తుంటే మనకరెన్సీ బొంబాయిలోమార్చి మీకివ్వమని డబ్బిస్తాను. మీ రెండు కుటుంబాలూ ఖర్చులుపోను బట్టలు కొనుక్కోండి. ఇక్కడి బట్టలు మీకు బాగుండవని నేను వచ్చేటప్పుడు తీసుకురాలేదు. అదీకాక నాన్నకోసం మీ రిద్దరూ డబ్బుఖర్చు చేసుకునివచ్చారు. ఆ డబ్బుకూడా పంపుతాను. పిల్లలు జాగ్రత. అవసరమైతే బేబీకేర్ సెంటర్‌లో చేర్చండి. తల్లులు ఆఫీసులకు వెళ్ళాలి కదా. వారం వారం కాకపోయినా నెలకు రెండుసార్లయినా ఇళ్లు శుభ్రంచేయించుకోండి.

నేను ఇక్కడికిరాగానే మందులు తీసుకుని బాగానేఉన్నాను. నా కోసం బాధపడకండి." అని ఉత్తరంరాసి పోస్టు చేయించింది సరోజని. అమెరికాలో ఉన్న ఇద్దరు కొడుకుల తల్లి.

38)